www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

మంగళవారం
10.11.2026



- అధిక ధరలకు విక్రయిస్తే పీడీ యాక్ట్
- రకాలను బట్టి గరిష్ట ధరల ఖరారు
- నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు
- ధరల నియంత్రణకు నిరంతర తనిఖీలు

రాష్ట్రంలో బియ్యం ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేస్తూ తెలంగాణ పౌరసరఫరాల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించి కిలో రూ.100 వరకు అమ్ముతుండటంతో సామాన్యులకు ఊరట కల్పించేందుకు రకాలను బట్టి గరిష్ట చిల్లర ధరలను (ఎంఆర్పీ) ఖరారు చేసింది. బీపీటీ, కేఎన్ఎం రకం కిలో రూ.66, తెలంగాణ సోనా రూ.74, హెచ్ఎంటీ, జైశ్రీరాం రకాలకు రూ.79గా నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, పదే పదే ఉల్లంఘిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని పౌరసరఫరాల శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

-కలంజ్యోతి బ్యూరో

2 లో



బియ్యం ధరలకు సర్కార్ కళ్లెం!

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి జైలుశిక్ష


- కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు సంచలన తీర్పు
- శిక్ష అమలుపై నాలుగు వారాల స్టే

3 లో



న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిన కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి తెలంగాణ హైకోర్టు 6 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 2,000 జరిమానా విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. నిషేధిత ఆస్తుల జాబితా నుంచి కొన్ని ప్లాట్లను తొలగించాలన్న వినతిపై కోర్టు నిర్దేశించిన 60 రోజుల గడువులోగా స్పందించకపోవడం, కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే నామమాత్రంగా తిరస్కరణ ఉత్తర్వులు ఇవ్వడంపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యతాయుతమైన ఐఏఎస్ అధికారి న్యాయస్థాన ఉత్తర్వులను నిర్లక్ష్యం చేయడాన్ని తప్పుబడుతూ ఈ కఠిన శిక్ష ఖరారు చేసిన ధర్మాసనం, అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలుపై నాలుగు వారాల పాటు నిలిపివేత (స్టే) విధించింది.

కలంజ్యోతి,బ్యూరో



దేవుడు అన్నీ ఇచ్చాడు.. తిరిగిచ్చే బాధ్యత నాదే..

- కేసీఆర్ పాలమూరును నట్టేట ముంచారు
- మిగులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు
- జర్నలిస్టుల సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తాం
- హకీంపేట్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

4 లో

దేవుడు తనకు అన్ని పదవులూ ఇచ్చాడని, ఇక ప్రజలకు సేవ చేసి రుణం తీర్చుకునే బాధ్యత మాత్రమే తనపై ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని లగచర్లలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి, అనంతరం హకీంపేట్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. పాలమూరు జిల్లా ప్రజలు ఎంపీగా గెలిపిస్తే కేసీఆర్ ఆ జిల్లా రుణం తీర్చుకోకుండా నట్టేట ముంచి గజ్వేల్‌కు వెళ్లారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి తెచ్చారని, తమ ప్రజా ప్రభుత్వం వచ్చాకే ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించి త్వరలోనే ఇళ్ల పట్టాలు అందజేస్తామని, రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా రోజుకు 18 గంటలు పనిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కలంజ్యోతి,కొండగల్

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
మంగళవారం 10.11.2026
www.kalamjyothi.com

బియ్యం ధరలకు సర్కార్ కళ్లెం!



కలంజ్యోతి బ్యూరో (నవంబర్ 09) : రాష్ట్రంలో బియ్యం ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేస్తూ తెలంగాణ పౌరసరఫరాల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్లో కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి కిలో రూ.100 వరకు అధిక ధరలకు విక్రయిస్తుండటంతో, సామాన్యులకు ఊరట కల్పించేందుకు రకాలను బట్టి గరిష్ట చిల్లర ధరలను (ఎంఆర్పీ) ప్రభుత్వం ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. బియ్యం బస్తాలపై గరిష్ట ధరలను తప్పనిసరిగా ముద్రించాలని ఆదేశించింది. మార్కెట్ ధరలను తారుమారు చేయడం, అక్రమ నిల్వలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది.

రకాలను బట్టి గరిష్ట ధరల ఖరారు..


రాష్ట్రంలో తగినన్ని బియ్యం నిల్వలు ఉన్నాయని, కొరత ఉందనే ప్రచారాన్ని నమ్మవద్దని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధరల ప్రకారం బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ.66గా ఖరారు చేశారు. ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం బియ్యం కిలో గరిష్ట ధరను రూ.74గా పరిమితి విధించారు. అలాగే మార్కెట్లో డిమాండ్ ఉండే హెచ్ఎంటీ, జైశ్రీరాం రకాల గరిష్ట చిల్లర ధరను కిలో రూ.79గా నిర్ణయించారు. ఎల్ నినో ప్రభావంతో పంట దిగుబడి తగ్గి దేశవ్యాప్తంగా ధరలు పెరిగినప్పటికీ, రాష్ట్రంలో వినియోగదారులపై భారం పడకుండా ప్రభుత్వం ఈ పరిమితులను తీసుకొచ్చింది.

నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు..

ప్రభుత్వం నిర్దేశించిన ధరలను కాదని అధిక రేట్లకు అమ్మేవారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 5 వరకు ఎన్ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్, లీగల్ మెట్రాలజీ శాఖలు సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టాయి. టోకు వ్యాపారుల గిడ్డంగులు, రిటైల్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అధిక ధరలకు విక్రయిస్తున్న పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పదే పదే నిబంధనలు ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడితే ఏమాత్రం ఉపేక్షించకుండా పీడీ యాక్ట్ కింద కేసులు పెడతామని అధికారులు హెచ్చరించారు.

ధరల నియంత్రణకు నిరంతర తనిఖీలు..

రాష్ట్రవ్యాప్తంగా బియ్యం విక్రయాలు పారదర్శకంగా జరిగేలా నిరంతరం ప్రత్యేక బృందాలతో నిఘా ఉంచుతున్నట్లు అధికారులు వెల్లడించారు. రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ డీలర్లు, చిరు వ్యాపారుల వద్ద నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించడం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని తెలిపారు. ప్రతి దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను వినియోగదారులకు కనిపించేలా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. ఎవరైనా ఎక్కువ ధరకు విక్రయిస్తే ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని, బ్లాక్ మార్కెట్ దందాలను అరికట్టేందుకు యంత్రాంగం నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటుందని వివరించారు.



విద్యాకేంద్రాల్లో తనిఖీలు చేపట్టాలి

- మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలించాలి
- అధికారులు సమన్వయంతో తనిఖీలు చేయాలి

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 09) : నర్సంపేట మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను మండల స్థాయి అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి విజయ్ కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు గడ్డం సుభద్ర కోరారు. ఈ మేరకు సోమవారం నర్సంపేట మండల ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యార్థులకు అందుతున్న ఆహార నాణ్యత, ప్రభుత్వ సేవలను పరిశీలించాలని కోరారు. వారానికి కనీసం ఒక్కరోజైనా సంబంధిత అధికారులు ఆయా కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి సమస్యలను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

సమన్వయంతో తనిఖీలు చేయాలి..

మండల తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, మండల వైద్యాధికారులు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు సమన్వయంతో తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ కేంద్రాల్లోని సేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వినతిపై స్పందించిన ఎంపీడీవో, తహసీల్దార్ సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన అధికారులకు పాలకుర్తి విజయ్ కుమార్, గడ్డం సుభద్ర సంయుక్తంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్ నినోను కలిసికట్టుగా ఎదుర్కొంటాం

మంత్రి వివేక్ వెంకటస్వామి

కలంజ్యోతి, నర్సాపూర్ (నవంబర్ 10) : రైతులు పశుసంపదను పెంచుకుని అదనపు ఉపాధి మార్గాలను ఏర్పరచుకోవాలని కార్మిక, గనుల భూగర్భ వనరుల శాఖ, మెదక్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. నర్సాపూర్ మండలంలోని రామచంద్రపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశు చికిత్స అవగాహన కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిలతో కలిసి మంత్రి పాల్గొన్నారు. జిల్లాలో పశువులు, గొర్రెలు, మేకలకు అందుతున్నవైద్య సౌకర్యాల గురించి పశువైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గొర్రెల కాపరులకు గొర్రెలను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎల్ నినో అనేది ఒక ప్రకృతి వైపరీత్యమని, దానిని అందరూ కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోయాయని, రాబోయే రోజుల్లో తాగునీటికి ఇబ్బంది పడాల్సి వస్తుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 35 లక్షల బోరుబావులు





ఉన్నాయని, అక్టోబర్ నెలలో 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉపయోగించామన్నారు. ప్రత్యామ్నాయ పంటలు వేయకపోతే పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలతో కూడిన అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధానమంత్రిని సహాయం కోరతామని తెలిపారు. గతంలో తన తండ్రి కాకా వెంకటస్వామి సాగునీటి కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు.

సింగూరు నీరు మెదక్‌కే కేటాయించాలి..

మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పశు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా గ్రామాల్లో పశుసంపదను పెంచేందుకు, గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చాలా తక్కువగా ఉందని, కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు కోసం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు. జిల్లాలో ఉన్న సింగూరు నీటిని మెదక్ జిల్లా అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని కోరారు. హైదరాబాద్ నగరానికి ఎల్లంపల్లి, గోదావరి, నాగార్జునసాగర్, హిమాయత్ నగర్ రూపంలో నాలుగు మార్గాల ద్వారా తాగునీటి అవసరాలు తీర్చే అవకాశాలు ఉన్నాయని, మెదక్ జిల్లాకు మాత్రం సింగూరు ఒక్కటే దిక్కని పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పంటలపై అవగాహన కల్పించాలి..

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పశుసంపద పెరగాలంటే పశు సంతతి ఉత్పత్తిని పెంచాలని, పశువులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పశుసంవర్ధక శాఖలో ఉన్న సిబ్బంది కొరతను తక్షణమే తీర్చాలని డిమాండ్ చేశారు. సాగునీటిని పరిశ్రమలకు వినియోగించకుండా జిల్లా ప్రజల అవసరాల కోసమే కేటాయించాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆదిత్య వర్మ, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఘనంగా సీఎం రేవంత్ జన్మదిన వేడుకలు

కలంజ్యోతి, హత్నూర (నవంబర్ 09) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హత్నూర మండల పరిధిలోని మధుర గ్రామంలో నర్సాపూర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుమ్మరి భిక్షపతి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుమ్మరి భిక్షపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నిలపడమే ముఖ్యమంత్రి ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

మంగళవారం 10.11.2026

www.kalamjyothi.com

కలెక్టర్ నారాయణరెడ్డికి జైలుశిక్ష

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 09) : న్యాయస్థానం ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వులను బేఖాతరు చేసిన వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు హైకోర్టు నిర్ధారించింది. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం కలెక్టర్‌కు 6 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22A ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితా నుంచి కొన్ని ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు దాఖలు చేసిన వినతిని పరిశీలించాలని 2025 ఆగస్టులో హైకోర్టు కలెక్టర్‌ను ఆదేశించింది. 60 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా, గడువు ముగిసినా స్పందించకపోవడంతో బాధితులు 2025 అక్టోబర్ 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ నమోదైన తర్వాతే అధికారులు బాధితులకు నోటీసులు ఇచ్చి, 2026 ఫిబ్రవరి 26న, ఆ తర్వాత జులై 8న వినతిని తిరస్కరించడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

శిక్ష అమలుపై నాలుగు వారాల స్టే..

న్యాయస్థానం నిర్దేశించిన సమయంలో స్పందించకుండా, పిటిషన్ దాఖలయ్యాక నామమాత్రంగా ఉత్తర్వులు జారీ చేయడాన్ని తప్పుబట్టిన హైకోర్టు, కలెక్టర్ ఉద్దేశపూర్వకంగానే కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని స్పష్టం చేసింది. ఐఏఎస్ స్థాయి అధికారి కోర్టు ఉత్తర్వులను నిర్లక్ష్యం చేయడం సరికాదని పేర్కొంటూ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. అయితే, సైకోర్టులో అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును 4 వారాల పాటు నిలిపివేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.



రైస్ మిల్లర్లపై చర్యలు చేపట్టండి

అదనపు కలెక్టర్‌కు ఆప్ ఫిర్యాదు



కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 09): నిర్మల్ జిల్లా పరిధిలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి డిఫాల్టర్లుగా మారిన రైస్ మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనిఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ ప్రజావాణి లో వినతిపత్రం సమర్పించారు. నిర్మల్ జిల్లాలోని ఖైంసా ముధోల్, లోకేశ్వరం, బాసర, సారంగాపూర్, నర్సాపూర్‌జి, లక్ష్మణచాంద, ఖానాపూర్, నిర్మల్, మామడ, కడెం, దస్తురాబాద్, తదితర మండలాలకు చెందిన మొత్తం 41 రైస్ మిల్లులు డిఫాల్ట్ జాబితాలో ఉన్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయా మిల్లులపై ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో ఐపీసీ, బీఎన్ఎస్, అత్యవసర వస్తువుల చట్టం కింద ఎఫ్ఐఆర్ కేసులు నమోదయ్యాయన్నారు. కేసులు నమోదైనప్పటికీ సంబంధిత మిల్లుల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిల వసూళ్లు, తదుపరి చట్టపరమైన చర్యల్లో జాప్యం జరుగుతోందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డిఫాల్ట్ రైస్ మిల్లులపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రభుత్వ బకాయిలను రికవరీ చేయడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన, పరిపాలనాపరమైన చర్యలను వేగవంతం చేయాలని కోరారు.



అటల్ పెన్షన్ యోజన అమలులో

నిర్మల్ జిల్లాకు ఎక్సలెన్స్ అవార్డు

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 09) : అటల్ పెన్షన్ యోజన అమలులో 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్మల్ జిల్లా 95 శాతం నమోదు లక్ష్యాన్ని సాధించి ఎక్సలెన్స్ అవార్డును దక్కించుకుంది. జిల్లాలో మొత్తం 56,145 మంది ఈ పథకంలో చేరారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు ఇందుకోసం విశేష కృషి చేశారు. ఈ నెల 6న హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పీఎఫ్ఆర్‌డీఏ సీజీఎం ఆశుతోష్ కుమార్ చేతుల మీదుగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు ఆయన సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎల్‌డీఎం రాంగోపాల్‌ను అభినందించారు. జిల్లాకు ఈ గుర్తింపు కోసం కృషి చేసిన బ్యాంకు అధికారులు, సిబ్బందిని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవ రావు, రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ టెట్ హాల్‌టికెట్లు విడుదల

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 09) : తెలంగాణలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు నిర్వహించే ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీటెట్ 2026) హాల్‌టికెట్లు నవంబర్ 12 నుంచి అందుబాటులోకి రానున్నాయని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, టీజీటెట్ కన్వీనర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ లాగిన్ వివరాలను నమోదు చేసి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఈ ఆన్‌లైన్ పరీక్షలను నవంబర్ 19న రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. పేపర్ 1 పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు జరగనుండగా, దీనికి మొత్తం 2,591 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పేపర్ 2 పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనుండగా, ఈ పరీక్షకు 7,995 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని కన్వీనర్ రమేష్ వివరించారు.



బీడీ కార్మికులకు పని దినాలు కల్పించాలి

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 09) : బీడీ కార్మికులకు పనిదినాలు కల్పించకుండా నాణ్యమైన తునికాకు సరఫరా చేయకుండా బీడీ కార్మికులను దోపిడికి గురి చేస్తున్న శివాజీ బీడీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున కార్మికులు ధర్నా నిర్వహించి కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజన్న మాట్లాడుతూ శివాజీ బీడీ యాజమాన్యం నిర్మల్ జిల్లాలో దాదాపు 21 సెంటర్లు 400 బ్రాంచీలను విస్తరించి ఒక్కొక్క బ్రాంచ్ లో 40 నుండి 50 మంది చొప్పున 20వేల మందికి పని కల్పిస్తున్నారన్నారు. రెండు సంవత్సరాల నుండి కార్మికులకు నాసిరకం తునికాకు సరఫరా చేస్తూ, కార్మికులకు నాణ్యమైన బీడీలు తీసుకురావాలని ఒత్తిడి తెస్తూ, యాజమాన్య దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. నాణ్యమైన తునికాకు ఇవ్వకుండా కార్మికులే తమ వేతనాల నుండి తునికాకు కొనుగోలు చేసి కంపెనీకి భర్తీ చేస్తున్నారని పేర్కొన్నారు.

కార్మికులకు నెలకు 8 రోజుల పని కల్పిస్తూ 500 బీడీలకు మాత్రమే పని ఇస్తున్నారని, దీనివలన కార్మికులు సర్వీస్ నష్టపోతున్నారని పేర్కొన్నారు. పదవి విరమణ చేసే సమయానికి హాజరు సరిపోక పెన్షన్ పొందే అవకాశం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బక్కన్న, రామలక్ష్మణ్, గంగన్న, గపూర్, లక్ష్మి, గంగాధర్, శివలింగ, రమేష్, సత్యం, రాజేశ్వర్, నరేష్, లక్ష్మణ్, నర్సయ్య, కిషన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కలంజ్యోతి, నర్సాపూర్ (నవంబర్ 09) : నర్సాపూర్ నియోజకవర్గంలోని హత్నూర మండల పరిధి గుండ్లమాచనూరు, బొక్కలగూడెం గ్రామాలలో సోమవారం నాడు వరి కొనుగోలు కేంద్రాలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, గుండ్లమాచనూరు సర్పంచ్ శ్రీహరి, ఉపసర్పంచ్ శంకర్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 10.11.2026
4
www.kalamjyothi.com

దేవుడు అన్నీ ఇచ్చాడు.. తిరిగిచ్చే బాధ్యత నాదే..



కలంజ్యోతి, కొడంగల్ (నవంబర్ 09) : దేవుడు తనకు అన్ని పదవులూ ఇచ్చాడని, ఇక ప్రజలకు సేవ చేసి రుణం తీర్చుకునే బాధ్యత మాత్రమే తనపై ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని లగచర్ల లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి, అనంతరం హకీంపేట్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. పాలమూరు జిల్లా ప్రజలు ఆదరించి ఎంపీగా గెలిపిస్తే కేసీఆర్ ఆ జిల్లా రుణం తీర్చుకుంటారని భావించామని, కానీ ఆయన ప్రజలను నట్టేట ముంచి గజ్వేల్‌కు వెళ్లారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

రైతు కు టుంబం నుంచి వచ్చిన తనను ప్రజలు ముఖ్యమంత్రిగా ఆశీర్వదించారని, జీవితాంతం ఈ విషయాన్ని గుర్తుపెట్టుకుంటానని తెలిపారు. పాలమూరు నుంచి గతంలో ఎంతోమంది మంత్రులైనా వలసలు మాత్రం ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడ ప్రాజెక్టు చేపట్టినా పాలమూరు ప్రజలే కూలీలుగా వెళ్తున్నారని, దశాబ్దాలు గడిచినా స్థానిక ప్రాజెక్టులు పూర్తి కాలేదని విమర్శించారు. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా వలసలు ఆగలేదని, కొడంగల్‌లో కల్తీ కల్లు తాగే పరిస్థితులు తప్పలేదన్నారు. నాడు సాధించిన మక్తల్ నారాయణపేట ప్రాజెక్టును కేసీఆర్ పక్కన పెట్టారని, 75 ఏళ్లలో ఈ ప్రాంతానికి ఎవరూ న్యాయం చేయలేదని పేర్కొన్నారు.

మిగులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు..

పదేళ్ల పాలనలో కేసీఆర్ చేతికి ప్రజలు పన్నుల రూపంలో రూ.20 లక్షల కోట్లు ఇచ్చినా, మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి దిగజార్చారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024 జనవరి 1 నుంచి ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. పథకాలకు 10వ తేదీ లోపు నిధులు, కాంట్రాక్టర్లకు 20వ తేదీ లోపు బిల్లులు చెల్లిస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులకు, అప్పులకు తాము ఏటా రూ.80 వేల కోట్లు చెల్లిస్తూ వస్తున్నామని చెప్పారు.

బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్‌పై రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కేటీఆర్‌కు గడ్డం రావడానికి 50 ఏళ్లు పట్టిందని, బుద్ధి రావడానికి ఇంకెన్ని ఏళ్లు పడుతుందోనని ఎద్దేవా చేశారు. కేటీఆర్ గడ్డం పెంచినా, పది జన్మలు ఎత్తినా రేవంత్ రెడ్డి కాలేరని స్పష్టం చేశారు.

జర్నలిస్టుల సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తాం..

రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలు తనకు పూర్తిగా తెలుసని ముఖ్యమంత్రి అన్నారు. గతంలో ఇళ్ల పట్టాలు ఇస్తే సుప్రీంకోర్టు రద్దు చేసిందని, ఆ సమస్యను పరిష్కరించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. సొంత బిడ్డగా రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని పేర్కొన్నారు. దేవుడు తనకు ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ, ముఖ్యమంత్రిగా అన్ని పదవులూ ఇచ్చాడని, ఇక ప్రజలకు సేవ చేయడమే తన కర్తవ్యమన్నారు. తాను ముఖ్యమంత్రి అయ్యాక ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని తెలిపారు. సంక్రాంతి తర్వాత జిల్లాలో పర్యటించి అన్ని సమస్యలు తెలుసుకుంటానని చెప్పారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడానికి నిరంతరం శ్రమిస్తానని, ప్రజలంతా తనకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.



ఘనంగా సీఎం రేవంత్ జన్మదిన వేడుకలు

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 09) : మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్ ఆధ్వర్యం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్, గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్ హాజరయ్యారు. మాజీ సర్పంచ్, మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూటి పావని రమేష్‌తో కలిసి కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

సొంతింటి కల నెరవేర్చినందుకు కృతజ్ఞతలు..

అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పిలుపు మేరకు గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన కరెడ్ల అనూష రాకేష్, షేక్ కయాజ్ రేష్మ, తేజావత్ భవాని బ్రు దంపతుల నూతన గృహాల్లో దీపావళి సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ తమ సొంతింటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బానోత్ వీరన్న నాయక్, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లావుడ్యా వెంకన్న, ప్రధాన కార్యదర్శి బాధవత్ చందర్, బోనగిరి సారయ్య, బాధవత్ పెద్ద వీరు, ముత్యం భద్రయ్య, పెద్దమ్మల రాజేందర్, బాలాజీ, వార్డు సభ్యులు, మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, యువకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మిరామానంద్

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 09) : నర్సంపేట పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. కాంతుల పండుగ సందర్భంగా ఇంటిని దీపాలతో శోభాయమానంగా అలంకరించి, దీపాలు వెలిగిస్తూ, బాణసంచా కాలుస్తూ కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాల నడుమ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.



కొత్త ఆశలు విజయాలు తీసుకురావాలి..

చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో సరికొత్త ఆశలు, అవకాశాలు, విజయాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నర్సంపేట పట్టణ ప్రజలందరికీ ఆమె దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

దీపావళి సంబురాలు

కలంజ్యోతి, నర్సాపూర్ : హత్నూర మండలం సదుల నగర్ గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. కాంతుల పండుగ సందర్భంగా ఇంటిని దీపాలతో అలంకరించి, దీపాలు వెలిగిస్తూ, బాణసంచా కాలుస్తూ కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాల మధ్య వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదుల నగర్ గ్రామపంచాయతీ మాజీ సభ్యుడు వన్నరిగారి వీరేశం మాట్లాడుతూ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరారు. ఈ వేడుకల్లో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అంబరాన్నంటిన దీపావళి సంబురాలు


కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 09) : చెన్నారావుపేట మండలంలోని పాత మగ్దూంపురం గ్రామంలో దీపావళి పండుగ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఇందిరమ్మ ఇంటి వద్ద దీపాల వెలుగులు, ప్రజల ఆనందోత్సాహాల మధ్య పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. స్థానిక సర్పంచ్ ననుమాస కరుణాకర్, ఉప సర్పంచ్ అలవాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ కుమారి, పీఏసీఎస్ డైరెక్టర్ ననుమాస వీరస్వామి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దీపావళి పండుగను గ్రామ ప్రజలందరితో కలిసి సంతోషంగా జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామమంతా పండుగ శోభతో కళకళలాడగా, చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రజలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. గ్రామ ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, ఆనందాన్ని చాటిచెప్పేలా దీపావళి వేడుకలు కన్నులపండువగా సాగాయి. దీపాల కాంతులతో గ్రామం కొత్త వెలుగులను సంతరించుకోగా, పరస్పర శుభాకాంక్షలు, ఆత్మీయ పలకరింపులతో పండుగ వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. ఈ వేడుకల్లో వార్డు సభ్యులు నాంపల్లి సంపత్, జన్ను రమేష్, కొయ్యల స్వప్న, షేక్ హసీనా తదితరులు పాల్గొన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
మంగళవారం 10.11.2026
www.kalamjyothi.com

నాణేల కోసం పోటెత్తిన భక్తులు

కలంజ్యోతి, హైదరాబాద్ : చారిత్రాత్మక చార్మినార్ వద్ద కొలువుదీరిన ప్రసిద్ధ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో దీపావళి వేళ ఖజానా నాణేల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కావడంతో భక్తులు పోటెత్తారు. నగర నలుమూలల నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీ గుల్జార్ హౌస్ వరకు బారులు తీరడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు నాలుగు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా నాణేల పంపిణీని చేపట్టారు. ఏడాదంతా భక్తులు అమ్మవారికి సమర్పించిన వెండి కానుకలను కరిగించి, అమ్మవారి రూపం ముద్రించిన ప్రత్యేక నాణేలను తయారు చేసి దీపావళి వేళ ప్రసాదంగా పంపిణీ చేయడం ఇక్కడి ఆనవాయితీ. ఈ పవిత్ర నాణెం ఇంట్లో ఉంటే ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, లక్ష్మీ కటాక్షం సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ధనత్రయోదశి నుంచి పండుగ తర్వాత రెండు రోజుల వరకు మొత్తం మూడు రోజుల పాటు ఈ ఖజానా నాణేల పంపిణీ కొనసాగనుంది. ఈ ప్రత్యేక రోజుల్లో భక్తుల సౌకర్యార్థం ఆలయాన్ని 24 గంటల పాటు తెరిచి ఉంచుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాబోయే రెండు రోజులు కూడా భక్తుల రద్దీ భారీగా ఉండే అవకాశం ఉన్నందున, భక్తులు ఎలాంటి తొందరపాటు లేకుండా క్యూ నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా దర్శనం చేసుకోవాలని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు.



కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

దర్శకుడి ఆలోచన మేరకే

ఆ ముగింపు

‘దోరతి’ చిత్రంలో తన పాత్ర ముగింపుపై కథానాయిక కీర్తి సురేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రమోషన్లలో మాట్లాడిన ఆమె, తన పాత్ర ఎలా మరణించిందో చూపించకపోవడంపై దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్‌ను ప్రశ్నించగా, ముగింపును ప్రేక్షకుల ఊహకే వదిలేసేలా ‘ఓపెన్ ఎండెడ్’గా డిజైన్ చేశారని తెలిపారు. సాధారణ చిత్రాల్లా కాకుండా ప్రేక్షకులే ఆలోచించుకునేలా ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. పాత్రల స్వభావం పూర్తిగా దర్శకుడికే తెలుస్తుందని, ఎల్లప్పుడూ దర్శకుడి ఆలోచనను నమ్మి నటిస్తానని కీర్తి సురేష్ స్పష్టం చేశారు.

MH Gallery MH Gallery MH Gallery MH Gallery MH Gallery MH Gallery MH Gallery MH Gallery

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.